# అమ్మకు ఆపద



## ప్రతీ ఏడు సెకన్లకు ఒక మరణం..

- మాతాశిశు మరణాల్లో భారత్ టాప్
- ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏటా 45లక్షల మాతా,శిశు మరణాలు
- ఆందోళన కలిగిస్తున్న ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక
- నేడు ప్రపంచ మాతృదినోత్సవం

వనం నాగయ్య, కెరటం న్యూస్

**సృష్టికి మూలం అమ్మ..** తన బిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతూ గుండెల్లో పెట్టుకుని పెంచుతుంది అమ్మ. బువ్వపెట్టి, బుజ్జగించి, లాలించి, పాలించి.. తన బిడ్డల్ని ప్రయోజకుల్ని చేసేంతవరకు విశ్రమించదు అమ్మ. ఈ సృష్టిలో అమ్మకన్నా విలువైంది ఏదీ లేదు. అందుకే 'మాతృదేవో భవ' అని దైవంతో సమానంగా అమ్మను కొలుస్తాం. అలాంటి అమ్మకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. ఆ తల్లిని గౌరవించాలన్న ఆలోచనతో పుట్టినదే 'మదర్స్ డే'. ఎక్కడో అమెరికాలో మొదల్కెన ఈ సంప్రదాయం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే స్థాయికి వెళ్లింది.



### మదర్స్ డేకు అడుగులు పడింది ఇలా...

అమెరికాకు చెందిన మేరీ జార్విస్ మదర్స్ డేకు నాంది పలికారు. ఆమె తల్లి ఎన్.జార్విస్‌కి మదర్స్ డే ఏర్పాటుచేయాలనే కోరిక ఉండేదట. తన ఆశయం నెరవేరకుండానే మే 9, 1905న ఎన్.జార్విస్ కన్నుమూశారు. ఆ తరవాత మేరీ జార్విస్ ఈ మహా కార్యానికి శ్రీకారం చుట్టారు. మదర్స్ డేను మే రెండో ఆదివారం జరుపుకోవాలని నిర్ణయించారు. అమెరికాలో మదర్స్ డేను జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని మేరీ ప్రచారం మొదలుపెట్టారు. తదనంతరం మాతృదినోత్సవాన్ని అంతర్జాతీయంగా సెలవు దినంగా ప్రకటించాలని నినాదం తీసుకొచ్చారు. దీనికి విస్తృతంగా మద్దతు కూడగట్టారు. మదర్స్ డేను సెలవు దినంగా ప్రకటించాలని మొదటిగా అమెరికాలోని పశ్చిమ వర్జీనియా రాష్ట్రం నిర్ణయించింది. 1910లో అధికారిక సెలవు దినాన్ని ప్రకటించింది. ఆ తరవాత యూఎస్‌లోని మిగిలిన రాష్ట్రాలు మదర్స్ డేను సెలవు దినంగా ప్రకటించాయి. మే నెలలో రెండో ఆదివారాన్ని మదర్స్‌డేగా గుర్తిస్తూ మే 8, 1914న యూఎస్ కాంగ్రెస్ ఓ చట్టాన్ని చేసింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్.. తొలి జాతీయ మాతృదినోత్సవాన్ని మే 9, 1914న ప్రకటించారు. మదర్స్ డేపై 1934లో తొలిసారి అమెరికా పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. ఇంత ఘన చరిత్ర ఉన్న అమ్మ పండుగను ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నాం.

### అమ్మకు ఆపద..

మదర్స్ డేకు సరిగ్గా కొద్ది రోజుల ముందు ఐక్యరాజ్యసమితి తాజాగా విడుదల చేసిన ఓ నివేదిక యావత్ ప్రపంచాన్ని విస్తుపోయేలా చేస్తోంది. సృష్టికి మూలమైన అమ్మ ఆయువు ప్రమాదంలో ఉందని ఆ నివేదిక సారాంశం. అది ఎంతలా అంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ సెకనుకూ ఒకరి మరణం సంభవిస్తోంది. పురిటి నొప్పులతో పండంటి బిడ్డకు జన్మనివ్వాల్సిన అమ్మ ప్రసూతి క్షణాల్లో అనూహ్యంగా ప్రాణాలు కోల్పోతున్నారు. అదే క్రమంలో శిశు మరణాలు కూడా ఎక్కువగానే సంభవిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి వెల్లడిరచింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ రెండు నిమిషాలకు కనీసం మూడు మాతా,శిశు మరణాలు చోటు చేసుకుంటుండటం విస్తు గొలుపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 45లక్షల మాతా శిశు మరణాలు చోటుచేసుకుంటున్నాయి.

### మరణాల్లో భారత్‌దే అగ్రస్థానం..

మాతృదినోత్సవం సందర్భంగా అమ్మలకు శు భాకాంక్షలు తెలిపే రోజున కొన్ని కఠోర వాస్తవాలను కూడా చూడాల్సి వస్తోందన్న చర్చ జరుగుతోంది. అందులో ప్రధానంగా అమ్మతనాన్ని గొప్పగా ఫీలయ్యే




ప్రతీ మహిళా పురుటినొప్పులు పడాల్సిందే. ఆ క్రమంలోనే అమ్మలోని అనుభూతిని అందుకునే వేళ అమ్మలను ప్రసూతి మరణాలు కలవరపెడుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ మరణాలు సాధారణమై పోయాయి. అందులో భారత్ అగ్రస్థానం దక్కించుకోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజా లెక్కల ప్రకారం..ఇండియాలో ప్రతీ ఏడాది 24వేల మందికి ప్రసూతి మరణాలు శాపంలా వెంటాడుతుండగా, 4.68లక్షల నవజాత శిశువుల మరణాలు, 2.97లక్షల ఆరు నెలల్లోపు శిశువుల మరణాలు కలుపుకుని మొత్తం 7.89లక్షలు అంటే సుమారుగా 8లక్షల మరణాలు చోటుచేసుకుంటున్నాయి. భారత్ తరువాత నైజీరియాలో ప్రతీ ఏడాది 82వేల ప్రసూతి, 2.77లక్షల నవజాత శిశువుల, 1.81లక్షల ఆరు నెలలలోపు శిశువుల మరణాలు చోటుచేసుకుంటూ మొత్తం మీద 5.40లక్షల మరణాలతో రెండో స్థానంలో ఉంది. తర్వాత పాకిస్తాన్‌లో 4.74మాతా శిశు మరణాలు, కాంగోలో 2.41లక్షల మరణాలు, ఇథియోపియాలో 1.98లక్షల మరణాలు చోటుచేసకుంటున్నాయి. ప్రపంచంలో ఏటా 2.90లక్షల ప్రసూతి మరణాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్న అంశం. ఇదిలా ఉండగా 60శాతం మాతా శిశు మరణాలు భారత్, నైజీరియా, పాకిస్తాన్, కాంగో, ఇథియోపియా, బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, ఆఫ్ఘనిస్తాన్, టాంజానియా దేశాలు మాతా శిశు మరణాలో ముందు వరుసలో కొనసాగుతున్నాయి. అందుకే తాను అవసరమైతే ప్రాణాలు ఒడ్డి మరో జీవికి జన్మనిచ్చే అమ్మలకు ఏమిచ్చినా ఈ జన్మకు రుణం తీరదు..అమ్మలూ మీ పాదాలకు వందనాలు, కలకాలం మీరు వర్ధిల్లాలి.. సృష్టిని బతికించాలని కోరుకుందాం..

## సృష్టికి మూలమైన అమ్మలకు శుభాకాంక్షలు..పారుపల్లి శేషప్రసూన కుమారి, ప్రధానోపాధ్యాయురాలు, ఖమ్మం



నేడు ప్రపంచ మాతృదినోత్సవం సందర్భంగా మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు. సృష్టిని నిర్మించేందుకు తను పురుటి కష్టాలు పడి, తాను బిడ్డకు జన్మనిచ్చే అపురూపమైన శక్తి ఒక్క మహిళకే సొంతం. అమ్మలా, ఆలిగా, చెల్లిగా, అక్కగా, స్నేహితురాలిగా, ఇలా అనేక పాత్రల్లో అమ్మకు ప్రతిరూపాలు కనిపిస్తాయి. ఇలాంటి అపురూపమైన రోజున ప్రతీ ఒక్కరికీ శుభాకాంక్షలు.మీ 'సంకల్పం' సజీవం.